క్లుప్తంగా

స్పందనకు 17 అర్జీలు

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కమిషనర్ ఎం .వెంకటేశ్వరరావు నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 17 అర్జీలు అందాయి. టిడ్కో ఇళ్లకు సంబంధించి 6 అర్జీలు, పట్టణ ప్రణాళిక విభాగానికి 3 అర్జీలు, శానిటేషన్ విభాగానికి 4 అర్జీలు, రెవెన్యూ విభాగానికి 2, ఇంజినీరింగ్ విభాగానికి 2 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ వివరించారు. వాటిని ఆయా విభాగాలకు పంపి త్వరగా పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. స్పందనపై కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా కమిషనర్ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

చీమకుర్తి: పారా అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు అనూరాధ, భగత్‌సింగ్ తెలిపారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులోని విద్యార్థులు, టీచర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలడిగి తెలుసుకున్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, కొత్తపట్నం, ఒంగోలు మండలాల పరిధిలోని 40 హైస్కూళ్ల విద్యార్థులతో మానవ హక్కుల సంఘం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి సంస్థ పనిచేస్తోందని వారు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

చీమకుర్తి: గడిచిన విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొంకణంపాటి మోహన్‌రావు సోమవారం నగదు బహుమతులు అందించారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇస్తర్ల తనుష్‌కు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా షేక్ అఫిల్‌కు రూ.5 వేల నగదు అందించారు. ఉత్తమ విద్యాబోధన చేసిన టీచర్ చెంచయ్యకు రూ.5 వేల బహుమతి అందించారు. సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడి అదే పాఠశాలలో మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులివ్వడం అభినందనీయమని హెచ్‌ఎం రామారావు, ఎంఈఓ వెంకారెడ్డి, టీచర్లు అభినందించారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలివ్వాలి

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ సౌకర్యాలు, బీమా వర్తింపజేయాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నినాదాలు చేశారు.

యర్రగొండపాలెం వాసికి డాక్టరేట్

యర్రగొండపాలెం: స్థానిక వై.కొత్తపల్లికి చెందిన బి.రమణారెడ్డికి డాక్టరేట్ లభించింది. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో వనరుల కేటాయింపు పథకం కోసం ఆప్టిమైజేషన్ విధానాలపై స్టడీ చేయడంతో కర్ణాటక బెలగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ వారు ఆయనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అందజేశారు. డాక్టరేట్ పొందిన రమణారెడ్డిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు, సీఎస్ఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ రమణ్ దుగ్యాల, వై.కొత్తపల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపిక

మార్కాపురం: మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో కమలా కాన్సెప్ట్ స్కూల్ పదో తరగతి విద్యార్థి జి.సిరిచందన ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ పి.పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎంపీ పుల్లయ్య తెలిపారు. విద్యార్థిని సిరిచందనను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ జీవనందు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు చందలూరు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దర్శి: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని చందలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత శనివారం జిల్లా స్థాయిలో తూర్పుగంగవరంలో నిర్వహించిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో సీనియర్ బాలుర విభాగంలో ఎస్.పవన్‌కుమార్, ఎం.రాకేష్, సీనియర్ బాలికల విభాగంలో కే నందిని, జూనియర్ విభాగంలో వై.దయాసాగర్, వై.బ్రిట్టి, జూనియర్ బాలికలలో ఏ అంజలిలాస్య, జి.శైలజ ఉన్నట్లు తెలిపారు. వీరు ఈ నెల 29వ తేదీ తెనాలిలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. వీరు జాతీయస్థాయికి ఎంపిక కావాలని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

మహిళా మార్ట్‌తో తక్కువ ధరకే సరుకులు

- డీపీఎం రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రాంబాబు

మద్దిపాడు: తక్కువ ధరలకు సరుకులు ఎస్‌హెచ్‌జీలకు అందించడమే మహిళా మార్టు లక్ష్యమని డీపీఎం రాంబాబు అన్నారు. సోమవారం మద్దిపాడు వైఎస్సార్ కేపీ, డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిపాడులో మహిళా మార్టు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన విషయమన్నారు. ఈ మార్టు వలన స్థానిక ప్రజలకు తక్కువ ధరకే సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు, దుస్తులు తదితరాలు లభిస్తాయన్నారు. అన్ని రకాల వస్తువులను మార్టులో ఏర్పాటు చేయడం వలన మార్టు విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఏపీఎం నరేంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని మార్టుల కంటే మద్దిపాడులో ఏర్పాటు చేయబోతున్న మహిళా మార్టు అధిక లాభాల్లో ఉండేలా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, డ్వాక్రా మహిళలు సరుకులు కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, అధ్యక్షురాలు కెజియా, కార్యదర్శి జ్యోతి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లికి పలువురు శుభాకాంక్షలు



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను అభినందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ రెండు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ వెంకాయమ్మను వారు అభినందించారు.

హెల్త్ క్యాంప్‌లను విజయవంతం చేయాలి



హెల్త్ క్యాంప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత, డాక్టర్ శివపార్వతి

ఈతముక్కల (కొత్తపట్నం): జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామ సచివాలయం-2లో మంగళవారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను విజయవంతం చేయాలని ఈతముక్కల పీహెచ్‌సీ డాక్టర్ శివపార్వతి కోరారు. ఈతముక్కల గ్రామ సచివాలయం-2 పరిధిలో వీవర్స్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ ప్రాంగణంలో క్యాంప్ జరుగుతుందని చెప్పారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాతతో కలిసి డాక్టర్ శివపార్వతి, డాక్టర్ వెంకటేష్ సోమవారం స్కూల్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హెల్త్ క్యాంప్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈతముక్కల గ్రామ సచివాలయం-2 పరిధిలోని వైద్య సిబ్బంది నాలుగు రోజుల నుంచి ఇంటింటి సర్వే చేసి ఏ ఇంటిలో ఎవరికి ఏ వ్యాధి ఉందని గుర్తించి వారికి టోకెన్లు ఇవ్వడం జరిగిందన్నారు. మెరుగైన వైద్యం కోసం జిల్లాలోని ఈతముక్కల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవడం జరిగిందని తెలిపారు.

పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలు



ఉలిచిలో సర్వే నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం, సీహెచ్‌వో, ఆశాలు

ఒంగోలు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఈ నెల 30న ప్రారంభంకానున్న నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో సర్వేలు చేపట్టారు. మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో సర్వే హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆయా గ్రామాల సీహెచ్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వారు తీసుకుంటున్న మందులు తదితర వివరాలు సేకరిస్తున్నారు. వారికి ఏ తేదీ ఎక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తారనే దానిపై రసీదు అందజేస్తున్నారు. సోమవారం కరవది మెడికల్ ఆఫీసర్లతో పాటు ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి సర్వేలను పర్యవేక్షించారు.

గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసమే 104 సేవలు



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ వాణి, సిబ్బంది

ఒంగోలు రూరల్: మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం 104 సేవలు అందిస్తోందని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి తెలిపారు. ఉలిచి ఎస్సీకాలనీలో 104 సేవలను సోమవారం ఆమె ప్రారంభించారు. 210 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని లడ్డూ రూ.95 వేలు

- ఊరేగింపులో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ఊరేగింపులో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలోని తోపుబజారులో బూచేపల్లి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం లడ్డూకు సోమవారం నిర్వహించిన వేలం పాటలో ఉల్లి మల్లికార్జున, కౌన్సిలర్ కంజుల ప్రతాప్‌రెడ్డి రూ.95 వేలకు పాడుకున్నారు. అనంతరం నిర్వహించిన ఊరేగింపులో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకాయమ్మను వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. వై.జనార్ధన్‌రెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, మంచా హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు

చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని చీమకుర్తిలోని ప్రగతి మోడల్ స్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్‌ఎం సుప్రజ, టీచర్ల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మెరుగైన సేవలు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌క్వాస్ టీం

గుండమాల (కొత్తపట్నం): వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎన్‌క్వాస్ టీం సభ్యులు ఆర్.రేవతి, మున్‌మున్ మండేల్ తెలిపారు. గుండమాల వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను సోమవారం సందర్శించి తనిఖీలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ (సీహెచ్‌వో), ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ల రికార్డులు పరిశీలించారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, ఓపీల శాతం, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లను తనిఖీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు తనిఖీ చేసి గ్రామస్తులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పనితీరు, రికార్డులు, మెరుగైన వైద్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కన్సల్‌టెంట్ ఏఎస్ మురళీకృష్ణ, జిల్లా డీపీఎం టి.వాణి, కొత్తపట్నం పీహెచ్‌సీ డాక్టర్ పి.హేమంత్‌కుమార్, సూపర్‌వైజర్లు జి.సులోచనరాణి, బి.ప్రభాకర్, సీహెచ్‌వో ఓంకార్, ఎంఎల్‌హెచ్‌పీ బాబామాలిక్, ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, ఆశా వర్కర్లు నాగమణి, వీరలంకమ్మ పాల్గొన్నారు.

ఎంపీపీకి అభినందనలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ అరుణ కోటిరెడ్డి దంపతులు

మద్దిపాడు: మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎంపికై రెండు సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి తమ స్వగ్రామం ఇనమనమెళ్లూరు సచివాలయంలో గ్రామ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రాబోయే రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకుడు అకుల శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్య పనుల పరిశీలన



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పారిశుధ్య కార్మికులను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. నగరంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మురుగు కాలువల పరిశుభ్రంతో పాటు రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను కూడా తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 15వ తేదీ చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

కుటుంబ వివాదాల నేపథ్యంలో మోటార్ సైకిళ్ల దహనం



తగలబెట్టిన మోటార్ సైకిళ్లు

మద్దిపాడు: కుటుంబ వివాదాల నేపథ్యంలో మోటార్ సైకిళ్లను దహనం చేసిన సంఘటన మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఉండవల్లి వేణుగోపాలరావు (గోపి) గ్రామంలోని అతని మెకానిక్ షెడ్ వద్ద రిపేరు నిమిత్తం కస్టమర్లు ఉంచిన మోటార్ సైకిళ్లను దుండగులు కాల్చి వేసినట్లు మద్దిపాడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన భార్య చెల్లెలి భర్త శనివారం రాత్రి గుండ్లాపల్లిలోని తమ ఇంటికి మద్యం సేవించి వచ్చి ఇష్టానుసారం వ్యవహరించాడని తెలిపారు. ఆడవారిపై దాడికి పాల్పడ్డాడని, చుట్టుపక్కల వారు హెచ్చరించినా అసభ్యంగా మాట్లాడటమే కాకుండా ఆదివారం రాత్రి తన మోటారు సైకిల్ రిపేర్ షెడ్‌లోని రెండు మోటార్ సైకిళ్లపై పెట్రోలు పోసి నిప్పంటించాడని అనుమానంగా ఉందని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ఫార్మాసిస్ట్ డే

ఒంగోలు సెంట్రల్: సురక్షితమైన సమర్థవంతమైన మందులు అందించడమే లక్ష్యంగా ఫార్మాసిస్ట్ పని చేయాలని కార్ప్ డ్రగ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా సేఫ్టీ రైటర్ ఎస్.లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక క్విజ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం వరల్డ్ ఫార్మాసిస్ట్ డేని ఘనంగా నిర్వహించారు. లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాలేజీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాయత్రి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దక్షిణామూర్తి, తదితరులు ఫార్మసీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నిర్మల్‌నగర్ ప్రాంతంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని నిర్మల్‌నగర్, పరిసర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఒంగోలు పట్టణ డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నగరంలోని డీ-1 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల విద్యుత్ లైన్లలో దెబ్బతిన్న స్థంభాలు మార్చే పనులు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా నిర్మల్‌నగర్ పార్కు, బృందావన్‌నగర్, రిలయన్స్ స్మార్ట్, పండరీపురం, పంచముఖ ఆంజనేయస్వామి టెంపుల్, భవానీ వీధి, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, అంజయ్యరోడ్డు ఏరియాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వైభవంగా గణనాథుని పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీనగర్ నాలుగో లైనులో వరసిద్ధి వినాయకస్వామికి సోమవారం రాత్రి స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రికి గణనాథుడు ఉత్సవమూర్తికి వేద పురోహితులు ఆధ్వర్యంలో పంచామృతాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించగా, మహిళా భక్తులు అధిక సంఖ్యలో మంగళ దీపాలతో పాల్గొన్నారు. గాంధీనగర్ నాలుగో లైను నుంచి ఒకటో లైన్ మీదుగా స్వామివారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం



చతుర్వేద పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: కలియుగ వెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోషకాలంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను చక్కగా అలంకరించారు. నాద నీరాజనంతో పాటు చతుర్వేద పారాయణ జరిగాయి. శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, అధ్యాపకులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీకి చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి తెలిపారు. ఆదివారం కందుకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జిల్లాస్థాయి పోటీలలో ట్రిపుల్ ఐటీకి చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి జిల్లా ట్రిపుల్ ఐటీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- రైతులకు సాంకేతికపరమైన అంశాల్లో తర్ఫీదు ఇవ్వాలి
- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, జిల్లా అధికారులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విధిగా ప్రోత్సహించాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ ప్రకృతి వ్యవసాయంలో తీసుకుంటున్న మెళకువల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మహిళలను ఏవిధంగా ప్రోత్సహిస్తున్నారో వివరాలు రాబట్టారు. మహిళా సంఘాలను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సీ-1 నుంచి సీ-5 వరకు ఉన్న కార్యక్రమాల గురించి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 365 రోజుల పంటల ప్లానింగ్ గురించి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 2023-24 సంవత్సరానికి గాను ప్రకృతి వ్యవసాయంలో తీసుకుంటున్న మెళకువలు, జాగ్రత్తల గురించి ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వి.సుభాషిణి వివరించారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న పంటలు, వాటి విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి కూడా చెప్పారు. పురుగు మందుల అవశేషాలు లేకుండా పంటలు పండించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట్రావు, జేడీఏ ఎస్.శ్రీనివాస రావుతో పాటు జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

మాగుంటను సన్మానించిన జంకె



మాగుంట రాఘవరెడ్డిని సన్మానిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం రాత్రి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని సన్మానించారు. మార్కాపురంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన రాత్రి మార్కాపురంలోని జంకె నివాసానికి వెళ్లారు. తాజా రాజకీయాలపై చర్చించిన అనంతరం రాఘవరెడ్డిని సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మందటి మహేశ్వరరెడ్డి, ఒంటెద్దు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకుని అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి అభిషేకం రాఘవరెడ్డితో అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి జరిపించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు మల్లికార్జున్, పార్టీ నాయకులు సక్కా చిన్న త్రిపురారెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు. ఈఓ సాదర స్వాగతం పలికారు.